క్లుప్తంగా

కంప్యూటర్, జిరాక్స్ మిషన్ వితరణ



నకరికల్లు: మండలంలోని చల్లగుండ్ల ఎంపీపీ మెయిన్ పాఠశాలకు శ్రీ కల్పవల్లి సేవా ట్రస్ట్, వంకాయల ఆంజనేయులు సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో కంప్యూటర్, జిరాక్స్ పరికరాలను ఆదివారం వితరణ చేశారు. విశ్రాంత హెచ్ఎం జె.వీరాంజనేయులు, ట్రస్ట్ చైర్మన్ వెల్లంపల్లి కేశవరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరావు, హెచ్ఎం కె.వెంకటరాములు, ఉపాధ్యాయిని వి.శివదుర్గ పాల్గొన్నారు.

ఉద్యోగులకు సత్కారం



పెదకూరపాడు: మండలం కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం వివిధ విభాగాల్లో ఉత్తమ సేవలందించిన ప్రభుత్వ ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రామకృష్ణ మాట్లాడుతూ పర్చూరి లక్ష్మీ రంగరావు ఫౌండేషన్ నిర్వాహకుడు పర్చూరి నాని ఆధ్వర్యంలో ఉద్యోగులను సత్కరించినట్లు తెలిపారు.

పాస్టర్‌కు గౌరవ డాక్టరేట్



అమరావతి: ధరణికోట లూథరన్ చర్చి పాస్టర్ రెవరెండ్ సత్యానందకుమార్ సామాజిక సేవలో గౌరవ డాక్టరేట్ పొందారు. తెలుగు రాష్ట్రాలలో గ్రామీణ ప్రాంతాల్లో సేవలందించిన వారికి హైదరాబాద్‌లోని చిక్కడపల్లికి చెందిన ఫ్రెండ్స్ మినిస్ట్రీస్ ఈ గౌరవ డాక్టరేట్ శనివారం ప్రదానం చేసింది. ఆదివారం లూథరన్ చర్చిలో సత్యానందకుమార్‌ను సన్మానించారు. కె.శేషారావు, దానియేలు, మోషే, మోహన్, రమేష్ బాబు, సధాకర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బందికి ప్రశంసా పత్రాలు



అచ్చంపేట: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఉత్తమ సేవలకు గాను తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్ సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. వీఆర్వో సందెపోగు శేషయ్య, కంప్యూటర్ ఆపరేటర్లు రవి, గిరి, అటెండరు బుజ్జి అందుకున్నారు.

రంగస్థల కళాకారుడికి సన్మానం



సత్తెనపల్లి(ముప్పాళ్ళ): గణతంత్ర దినోత్సవంలో భాగంగా ఉషోదయ కళా పరిషత్ అధ్యక్షుడు పిన్నమనేని పాములయ్య ఆదివారం సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామానికి చెందిన రంగస్థల కళాకారుడు ఎలిశెట్టి వెంకటప్రసాదరావు అతని గృహంలో సన్మానించారు. వెంకటప్రసాదరావు విభిన్న పాత్రలు పోషిస్తూ అందరిచేత మన్ననలు పొందారన్నారు. దుగ్గినేని అయ్యన్న, కె.గోవిందరావు, ముట్టి రాంబాబు, బీవీ లక్ష్మయ్య, గొట్టం ఆంజనేయులు, పలువురు న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ మల్లయ్యకు ప్రతిభా అవార్డు



క్రోసూరు: రాష్ట్రస్థాయి ప్రతిభా పురస్కారాన్ని మండల పశువైద్యుడు డాక్టర్ మల్లయ్య అందుకున్నారు. గుంటూరు లోని ఏపీఎల్‌డీఏ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన పురస్కారాల వేడుకల్లో ఏపీఎల్‌డీఏ సీఈవో డాక్టర్ ఎం.శ్రీనివాసరావు చేతుల మీదగా రాష్ట్రస్థాయి ఉత్తమ పశు వైద్యుడిగా పురస్కారం అందుకున్నారు.

ఘనంగా గణతంత్ర సంబరాలు

పెదకూరపాడు, సత్తెనపల్లి నియోజకవర్గాల్లో 76వ గణతంత్ర దినోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. జాతీయ జెండాను అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఆవిష్కరించారు. అధికారులు జెండా వందనం సమర్పించారు. భారత రాజ్యాంగ స్ఫూర్తి, గొప్పతనాన్ని స్మరించుకున్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, విధులు, స్వేచ్ఛా వాయువులు వీటి వెనుక దాగి ఉన్న స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాన్ని గుర్తుచేసుకున్నారు.



జాతీయ జెండాతో దేశభక్తి గీతాలకు చిన్నారుల నృత్యం



పెదకూరపాడు తహసీల్దారు కార్యాలయంలో జెండా వందనం



జెండా ఆవిష్కరించిన వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ సుధీర్ భార్గవ్‌రెడ్డి

పెదకూరపాడు: తహసీల్దారు కార్యాలయంలో జరిగిన గణతంత్ర దినోత్సవంలో తహసీల్దారు మీసాల దానియేలు, ఎంపీడీవో రామకృష్ణ, ఎస్ఐ గిరిబాబు పాల్గొన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించి, గౌరవ వందన సమర్పించారు. చిన్నారులు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

క్రోసూరు: ఇన్‌చార్జి తహసీల్దార్ జింకా శ్రీనివాసరావు, ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ షేక్ జమీలా, సీఐ పి.సురేష్, ఎస్ఐ నాగేంద్రరావు తమ కార్యాలయాల్లో, పాఠశాలలు, ఇతర ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. జాతీయ జెండాను ఎగురవేసి, గౌరవ వందనం సమర్పించారు.

రాజుపాలెం: ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి, పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ వేణుగోపాల్, ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో డాక్టర్ కృష్ణకుమార్, సచివాలయంలో సర్పంచ్ పులిబండ్ల అశోక్ అలాగే పాఠశాలలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో గణతంత్ర దినోత్సవం నిర్వహించారు. జాతీయ జెండాను ఆవిష్కరించి, గౌరవ వందన సమర్పించారు.



జెండా ఆవిష్కరిస్తున్న రాజుపాలెం తహసీల్దారు

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోను, ప్రభుత్వ పాఠశాలల్లోను గణతంత్రదినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ ఎం.భవానిశంకర్, ఎంపీడీవో పీజే విలియమ్స్, ఎస్సై వి.సోమేశ్వరరావు తమ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమాల్లో ఇతర శాఖల మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అమరావతి: మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాలు, పాఠశాలల్లో ఆదివారం గణతంత్ర దినోత్సవం నిర్వహించారు. జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ గీతాలాపన చేశారు. ఎంపీడీఓ పార్వతీ, తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, మండల వ్యవసాయాధికారి అహ్మద్, సీఐ అచ్చియ్య జాతీయ జెండాను అవిష్కరించి, జెండా వందనం చేశారు. శ్రీరామకృష్ణ హిందూ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం మాజేటి రాము గణతంత్ర దినోత్సవాల్లో పాల్గొన్నారు.

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): రాజ్యాంగ సంక్షేమ ఫలాలు అందరికీ అందినప్పుడే నిజమైన రాజ్యాంగ దినోత్సవమని వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ బార్గవ్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని, జాతీయ జెండాను ఆవిష్కరించారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పక్కాల సూరిబాబు, చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ నాగూలు మీరా, కోటేశ్వరరావు నాయక్, కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్, పట్టణ పార్టీ అధ్యక్షుడు సహారా మౌలాలి, రూరల్ కన్వీనర్ రాయపాటి పురుషోత్తం పాల్గొన్నారు.

- పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి తౌసిద్ హుస్సేన్, ప్రథమ జూనియర్ సివిల్‌జడ్జి పి.ప్రియదర్శిని జాతీయ జెండాను ఎగురవేసి, జాతీయ నాయకులకు నివాళులర్పించారు. న్యాయవాది కంభాల అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.
- పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు జాతీయ జెండాను ఎగురవేసి, మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుక్కా చంద్రపాల్, పట్టణ అధ్యక్షుడు దాసరి జ్ఞాన్ రాజ్‌పాల్, పీసీసీ కార్యదర్శి మాదంశెట్టి వేదాద్రి పాల్గొన్నారు.
- పట్టణంలో గాంధీబొమ్మ సెంటర్‌లో ఆర్యవైశ్య సంఘం నాయకులు గణతంత్ర దినోత్సవం నిర్వహించారు. జాతీయ నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువజన సంఘం అధ్యక్షుడు చిల్లంచర్ల కల్యాణ్, యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొత్తా రామకృష్ణ, రాజేశ్వరరావు పాల్గొన్నారు.
- రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవం నిర్వహించారు. 50 మంది పెన్షనర్స్ పాల్గొన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల లక్ష్మీనారాయణ జాతీయ జెండాను ఎగురవేశారు. ప్రభుత్వ వైద్యశాలలోని బాలింతలకు, గర్భిణులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ప్రధానకార్యదర్శి కేబీఆర్‌జే ప్రసాద్, రంగారెడ్డి, ఎల్లినేడి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సత్తెనపల్లి కోర్టు ఆవరణలో జెండా ఆవిష్కరించిన జడ్జిలు



ప్రదర్శన నిర్వహిస్తున్న ముస్లిం విద్యార్థులు



అచ్చంపేట పీహెచ్‌సీలో జాతీయ పతాక ఆవిష్కరణ



క్రోసూరులో ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాసరావు, సిబ్బంది జెండా వందన సమర్పణ



ముప్పాళ్ల తహసీల్దార్ కార్యాలయంలో గణతంత్ర వేడుకలు



శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్‌లో జెండా వందనం

అచ్చంపేట: గణతంత్ర దినోత్సవంలో భాగంగా ముస్లిం ప్రముఖులు షేక్ కమల్‌సైదా, మౌలానా ఖలీద్, షేక్ బీరువాల జానీ ఆధ్వర్యంలో మండలంలోని 600 మంది ముస్లిం విద్యార్థులు జాతీయ జెండాలతో ప్రదర్శన చేశారు. అచ్చంపేట పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

అచ్చంపేట: మండలంలో గణతంత్ర దినోత్సవాన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్, ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు, సీఐ వెంకట ప్రసాద్, డాక్టర్ వి.రాంబాబునాయక్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. గౌరవ వందన సమర్పించారు. పలువురు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నివారణ మార్గాలపై అవగాహన

నకరికల్లు: క్యాన్సర్‌తో అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణుడు డాక్టర్ చెరుకూరి రవితేజ అన్నారు. ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులకు స్థానిక వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో సీఎంఈ క్లాస్‌ను ఏపీ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆర్ఎంపీ(ఐ)పీఎంపీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఫిట్స్, క్యాన్సర్ వ్యాధుల నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. ఫిబ్రవరి 4న క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా క్యాన్సర్ నివారణ టీకా వేయించుకునేందుకు ప్రజలందరికీ అవగాహన సూచించారు. అనంతరం ఆర్ఎంపీ, పీఎంపీలకు సర్టిఫికెట్‌లు, సంఘం ఐడీ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులను ఆర్ఎంపీలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ గంగూరి సుప్రజ, అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు షేక్.బాజీ, కార్యదర్శి షేక్.సైదా, కమ్యూనికేటర్ ఆరేటి నాగేశ్వరరావు, నకరికల్లు, నరసరావుపేట పట్టణ అధ్యక్షులు బాపతు చెన్నారెడ్డి, సాదినేని వీరాంజినేయులు, ఉప్పలపాటి వెంకట్రావు, కేసరి నర్సింహారెడ్డి, రమణారెడ్డి, మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ చెరుకూరి రవితేజ, డాక్టర్ గంగూరి సుప్రజకు సన్మానం

రైతుల సమస్యలపై రైతు సంఘాల ర్యాలీ

క్రోసూరు: దేశ వ్యాప్తంగా ఆల్ ఇండియా కిసాన్ మోర్చా (రైతు సంఘాల సమన్వయ కమిటీ) నిరసన కార్యక్రమంలో భాగంగా ఆదివారం రైతు సంఘం నాయకులు ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల సెంటర్ నుంచి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కౌలు రైతుసంఘం కమిటీ సభ్యుడు తిమ్మిశెట్టి హనుమంతరావు మాట్లాడారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పజెప్పేందుకు 2020లో తీసుకొచ్చిన నల్ల చట్టాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో 13 నెలల పాటు రైతాంగం పోరాటం చేసినట్లు గుర్తు చేశారు. ఈ ఉద్యమంలో దాదాపుగా 720 మంది రైతులు చనిపోయారని చెప్పారు. ప్రధానంగా ఎంఎస్ స్వామినాథన్ కమిటీ సిఫార్సులు మేరకు పంటలకు మద్దతు ధరల చట్టం, కేరళ తరహాలో రైతాంగానికి రుణ విమోచన చట్టాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యల పరిష్కారానికి మళ్లీ దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.రవిబాబు, అచ్చంపేట రైతు సంఘం మండల కార్యదర్శి రావెళ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



రైతు సంఘాల ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన ర్యాలీ

రోడ్డు ప్రమాదంలో యువకులకు తీవ్ర గాయాలు

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): వేగంగా ద్విచక్ర వాహనంపై వస్తున్న యువకులు ఎదురుగా వస్తున్న టాటా మ్యాజిక్ ఆటోను ఢీ కొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. రామకృష్ణాపురం అడ్డరోడ్డు వద్ద ఆదివారం ఘటన జరిగింది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. సత్తెనపల్లి మండలం గోరంట్ల గ్రామానికి చెందిన ఏలియా, అతని మిత్రుడు పెదకూరపాడు మండలం లగడపాడు గ్రామానికి చెందిన ఫణిదర్ మరో మిత్రుడు పుట్టిన రోజు వేడుకలకు హాజరై గుంటూరు నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. రామకృష్ణాపురం అడ్డరోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఏలియా తలకు, ఫణిదర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్పోర్ట్స్ బైక్ కావటంతో ముందు చక్రం పూర్తిగా విరిగి కొంత దూరంలో పడింది. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. యువకుల పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం గుంటూరుకు తరలించారు. ఏలియా అమరావతిలో ఐటీఐ చదువుతుండగా, ఫణిదర్ సత్తెనపల్లిలోని గురుకుల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు.



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఏలియా

యోగ విజ్ఞాన సేవ సంఘం నూతన కమిటీ ఎన్నిక

దాచేపల్లి : యోగా విజ్ఞాన సేవ సంఘం అధ్యక్షుడిగా దాచేపల్లికి చెందిన యర్రంశెట్టి గోపినాథ్ ఎన్నికయ్యారు. నారాయణపురంలోని యోగా విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా అమరా పార్ధసారధి, కార్యదర్శిగా తమ్మినేని అక్కిరాజ, సహాయ కార్యదర్శిగా బొడ్డు శేషగిరి, కోశాధికారిగా వంకాయలపాటి బాలకృష్ణ, సభ్యులుగా గోళ్ల శివనాగేశ్వరరావు, కటకం మురళీ, దేవరశెట్టి నాగేశ్వరరావులను ఎన్నుకున్నారు. యోగా చేయటం వలన మానసికంగా దృఢంగా ఉంటామని, దీర్ఘకాలిక రోగాల నుంచి విముక్తి పొందవచ్చని నూతన అధ్యక్షుడు గోపినాథ్ చెప్పారు. నూతన కమిటీ సభ్యులను పలువురు అభినందించి సన్మానించారు.

మద్యం సీసాలు స్వాధీనం



సత్తెనపల్లి(ముప్పాళ్ళ): మండలంలోని లక్కరాజుగార్లపాడు గ్రామంలో మద్యం విక్రయిస్తున్న మహిళను అదుపులోకి తీసుకొని, ఆమె నుంచి 11 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ పి.విజయ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా సత్తెనపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం మండలాల్లోని మద్యం షాపులు, బార్లకు సీల్ వేసినట్లు తెలిపారు. అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న లక్కరాజుగార్లపాడుకు చెందిన సీహెచ్ నాగమ్మ అనే మహిళను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఎస్సై కె.నాగలక్ష్మి, హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ నరసింహారావు, సిబ్బంది ఎం.శ్రీనివాసరెడ్డి, వి.దాసు పాల్గొన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా..

- పబ్లిక్ పరీక్షలకు పదో తరగతి విద్యార్థుల సన్నద్ధం
- 95 శాతం పాఠ్యాంశాల బోధన
- వంద రోజుల ప్రణాళికతో ప్రత్యేక శ్రద్ధ
- సంక్రాంతి సెలవుల తర్వాత పునశ్చరణ, స్లిప్ టెస్టులు

క్రోసూరు: పబ్లిక్ పరీక్షలకు పదో తరగతి విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. ఉత్తమ ఫలితాల సాధనకు రాష్ట్ర ప్రభుత్వం కూడా డిసెంబరు నుంచి వంద రోజుల ప్రణాళికను అమలు చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. క్రోసూరు మండలంలో 13 ఉన్నత పాఠశాలల్లో 878 మంది పదో తరగతి విద్యార్థులున్నారు. వీరంతా మార్చి 17 నుంచి పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్నారు.

95 శాతం పాఠ్యాంశాల బోధన పూర్తి

మండలంలోని జెడ్పీ, కస్తూర్బా, ఆదర్శ పాఠశాలల్లో దాదాపు 95 శాతం పాఠ్యాంశాల బోధన పూర్తయ్యింది. అర్ధ మాస, యూనిట్ పరీక్షలు, మోడల్ టెస్టులు పూర్తయ్యాయి. ఫలితాల్లో విద్యార్థులు ఏ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారో ఉపాధ్యాయులు గుర్తించారు. ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పునశ్చరణ చేయిస్తున్నారు. సబ్జెక్టు ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం స్టడీ అవర్లలో పఠన సామర్థ్యాన్ని మెరుగు పరుస్తున్నారు. సంక్రాంతి సెలవుల అనంతరం పాఠ్యాంశాల వారీగా పునశ్చరణ, స్లిప్ టెస్టులు నిర్వహిస్తున్నారు.



ప్రత్యేక తరగతిలో పదవ తరగతి విద్యార్థులు

మెరుగైన ఫలితాలకు కృషి



నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం. ప్రత్యేక తరగతులతో మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

– ఎం.గణేష్, ఎంఈవో–2, క్రోసూరు

ఆస్తి వివాదంలో కారుకి నిప్పు

పెదకూరపాడు: బంధువుల మధ్య ఆస్తి వివాదంలో కారుకు నిప్పంటించిన ఘటన లగడపాడు గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ గిరిబాబు వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మూల్పూరి అనిల్ కుమార్, బంధువు బండారుపల్లి పద్మావతి మధ్య కొంత కాలంగా పొలం వివాదం నడుస్తోంది. అనిల్ కుమార్ సత్తెనపల్లి ఆర్డీవోకు దరఖాస్తు చేసుకోగా అనుకూలంగా తీర్పువచ్చింది. ఈ నెల 25న పొలం చదును చేస్తుండా పద్మావతి, ఆమె కుమారుడు ప్రదీప్ అక్కడికి వెళ్లి అనిల్‌కుమార్ కుటుంబ సభ్యులను దుర్భాషలాడారు. వారిపై దాడికి ప్రయత్నించగా తప్పించుకున్నారు. ఈ క్రమంలో రోడ్డుపై ఉన్న అనిల్‌కుమార్ కారును ప్రదీప్ పెట్రోలు పోసి నిప్పంటించడంతో టైర్లు కాలినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



ముప్పాళ్ళ: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. మాదల గ్రామానికి చెందిన చింతపల్లి డేవిడ్ రాజు(21) ఈ నెల 20న ద్విచక్రవాహనంపై నుంచి రుద్రవరం గ్రామానికి వెళ్లి వస్తుండగా ప్రమాదవశాత్తూ జారి పడ్డాడు. తీవ్ర గాయాలతో గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

కృష్ణ మాదిగకు పద్మశ్రీ ప్రదానంపై హర్షం



అచ్చంపేట: కేంద్ర ప్రభుత్వం కృష్ణ మాదిగకు పద్మశ్రీ ప్రకటించడంపై మాదిగ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. సందెపోగు శ్రీనివాసరావు, చిల్కా భాస్కరబాబు, సందెపోగు మహేష్‌బాబు, బంకా కృష్ణారావు, సందెపోగు శరత్‌కుమార్, ఏడుకొండలు, ప్రదీప్ ఆనందం వ్యక్తం చేశారు.